

భీమవరం సోమేశ్వర స్వామికి అభిషేకాలు

శివాయ హరాయ


క్యూలైన్‌లో భక్తులు

శివాలయాల్లో కార్తీక సోమవారం పూజలు..

ఆలయాలు కిటకిట

- వివరాలు లోపలి పేజీల్లో

అభివృద్ధి..సంక్షేమం

» వ్యవసాయం, నీటి పారుదల శాఖకు మంచి రోజులు » జిల్లా రైతులు ఖుషీ
» బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఆర్థికంగా చేయూత » పెద్దమొత్తంలో నిధుల కేటాయింపు
» రాష్ట్ర బడ్జెట్‌పై ఎమ్మెల్యేల హర్షాతిరేకం



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి పెద్ద పీట వేసింది. వైసీపీ హయాంలో చేసిన తప్పిదాలకు దిద్దుబాటు జరిగేలా బడ్జెట్‌లో కేటాయింపులు నిర్వహించింది. వ్యవసాయం, ఉద్యానవనం, రహదారులు నిర్మాణానికి పెద్దపీట వేసింది. పట్టణాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చింది. గ్రామాల అభివృద్ధికి సముచిత స్థానం కల్పించింది. గడచిన ఐదేళ్లలో జిల్లాలో మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పట్టణాల్లో అభివృద్ధి పడకేసింది. గ్రామాల్లో మౌలిక వసతులు లేక మసకబారాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పల్లెలకు వెలుగు వచ్చింది. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో నిధులు కేటాయించారు. ఆర్థిక సంఘం నిధులను విడుదల చేశారు. రక్షిత మంచినీటి కోసం ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతులు, నిర్మాణానికి ఆర్థిక సంఘం నిధులు వెచ్చిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా పట్టణాలకు , గ్రామాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడంతో జిల్లాలో మౌలిక వసతులు అభివృద్ధి చెందనున్నాయి. మౌలిక వసతులపైనే ఇతర రంగాల అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో రహదారులకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించింది. కేంద్రం నుంచి లోసరి-భీమవరం-పిప్పర వరకు రహదారి అభివృద్ధి కోసం రూ. 100 కోట్లు మంజూరుచేసింది. తాజా బడ్జెట్‌లోనూ రహదారుల అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు. ఇది రవాణా రంగానికి ఊతం ఇవ్వనుంది.

బీసీ, ఎస్సీలకు పెద్దపీట

రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చేసిందేమీ లేదు. రాయితీ రుణాలు ఇవ్వలేదు. బీసీ, ఎస్సీ కార్పొరేషన్‌లు దారుణంగా దెబ్బతిన్నాయి. గత ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం మాత్రం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పెద్దమొత్తంలో నిధులు కేటాయించడంతో స్వయం ఉపాధి రుణాలు మంజూరు కానున్నాయి. గత తెలుగుదేశం ప్రభుత్వంలోనూ ఆదరణ వంటి పథకాల్లో పెద్దమొత్తంలో చేతి వృత్తిదారులకు, బీసీ, ఎస్సీలకు రాయితీ పరికరాలు అందించారు. బీసీ, ఎస్సీ వర్గాల్లో రైతులకు రాయితీలు కల్పించారు, వైసీపీ హయాంలో ఇవేమీ అమలు చేయలేదు. రాయితీ రుణాలు లేకపోవడంతో స్వయం ఉపాధి దెబ్బతింది. బడుగు, బలహీన వర్గాలకు జిల్లాలో ఆర్థిక చేయూత లేకుండా పోయింది. ఇప్పుడా పరిస్థితిని అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం కల్పించింది.

సాగునీటికి మంచి రోజులు

సాగునీటికి కూడా మంచిరోజులు రానున్నాయి. పంటకాలువలు, డ్రెయిన్‌ల ప్రక్షాళనకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఇప్పటికే డ్రెయిన్‌ల ప్రక్షాళనకు రూ.43 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. సాగునీరు సక్రమంగా అందాలన్నా, అధిక వర్షాల్లో ముంపుబారి నుంచి పంటపొలాలను రక్షించాలన్నా కాలువలు సవ్యంగా ఉండాలి. గత ప్రభుత్వం కాలువలను పూర్తిగా విస్మరించింది. బకాయిలను కూడా చెల్లించలేదు. కూటమి అధికారంలో వచ్చిన వెంటనే ప్రక్షాళనకు దిగింది. మధ్యంతర నిధులను మంజూరుచేసింది. డ్రెయిన్‌ల మరమ్మతులు చేపట్టింది. దాంతో కొంత మేర రైతులకు ప్రయోజనం కలిగింది. తాజాగా జలవనరుల శాఖకు పెద్దమొత్తంలో నిధులు కేటాయించడంతో జిల్లాలో పంట, మురుగు కాలువలకు ఢోకా ఉండదంటూ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమానికి పెద్దపీట

ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడానికి బడ్జెట్‌లో నిధులకు అధిక ప్రాముఖ్యత నిచ్చింది. ఇప్పటికే పెన్షన్‌లను పెంచింది. తల్లికి వందనం విడుదల చేయనుంది. అందులో భాగంగానే విద్యాశాఖకు పెద్దమొత్తంలో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. మొత్తంపైన రాష్ట్ర బడ్జెట్ సమగ్ర అభివృద్ధికి, సంక్షేమానికి కట్టుబడి ఉందన్న అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమవుతోంది.

మంచి బడ్జెట్

అంజిబాబు, ఎమ్మెల్యే, భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం మంచి బడ్జెట్ ప్రవేశపెట్టింది. అన్ని వర్గాల అభివృద్ధికి దోహదపడుతుంది. రహదారుల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తుంది. అభివృద్ధికి పెద్దపీట వేశారు. సంక్షేమం కోసం అధిక నిధులు కేటాయించారు.

అన్ని వర్గాలను ఆదుకునే బడ్జెట్

బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యే,



రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాలకు చేయూతనిచ్చేలా ఉంది. అభివృద్ధితో పాటు, సంక్షేమానికి పెద్దపీటు వేస్తూ కూటమి ప్రభుత్వం సమతుల్యత పాటించింది. జిల్లాలో మౌలిక వసతులు అభివృద్ధి చెందనున్నాయి.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట

బొమ్మిడి నాయకర్, ఎమ్మెల్యే



ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ రంగాలకు పెద్ద పీట వేయడం అభినందనీయం. వ్యవసాయం, పెండింగ్ ప్రాజెక్టుల వేగవంతం, విద్యా, వైద్య రంగాలకు పెద్ద పీట వేశాం.

అన్నివర్గాలకు పెద్దపీట

ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్యే



రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక కష్టాల్లోఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం మంచి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి అన్ని వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేసింది. వ్యవసాయ రంగానికి ప్రాముఖ్యత ఇచ్చింది. బీసీ, ఎస్సీ వర్గాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు కేటాయించింది.

వరద బాధితులకు రూ.కోటి 2లక్షలు

నియోజకవర్గం తరపున సీఎంకు ఎమ్మెల్యే అంజిబాబు చెక్కు అందజేత



భీమవరం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులను ఆదు కునేందుకు భీమవరం నియోజ కవర్గం నుంచి సేకరించిన రూ.కోటి 2 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకు భీమవరం ఎమ్మె ల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) సోమవారంనాడు అందించారు. భీమవరం నుంచి ఎంతో మంది దాతలు ముందుకు వచ్చి రూ.కోటి విరాళాలను అందించారని, వీటితోపాటు ఆహార పొట్లాలు, భోజనాలు, మరెన్నో సహాయ సహకారాలను అందించారని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే అంజిబాబు వివరించారు. వరద బాధితులకు నియోజకవర్గం దాతల సహకారం అద్వితీయ మని, ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపు తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు.

గ్రంధి నివాసంలో ముగిసిన ఐటీ సోదాలు

భీమవరం క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసంతో పాటు వ్యాపార భాగస్వాములు, సన్నిహితులు నివాసాల్లో ఆదివారం అర్ధరాత్రితో ఐటీ దాడులు ముగిశాయి. ఆరు రోజులుగా కొనసాగిన దాడులు ముగిశాయి. చెన్నై నుంచి వచ్చిన సుమారు 25 మంది ఐటీ అధికారులు దాడులు చేశారు. మరో ఏడుగురి నివాసాల్లో కూడా దాడులు కొనసాగాయి. సుమారు 10 కేజీల బంగారం, భారీగా డాక్యుమెంట్లు, ఫైల్స్ తీసుకుని వెళ్ళినట్లుగా సమాచారం. అధికారులు మీడియాతో మాట్లాడానికి నిరాకరించారు. ఏడుగురిలో ఒకరైన సంజన డెవలపర్స్ యజమాని నివాసంలో రూ.61 లక్షలు సీజ్ చేసినట్లు తెలిసింది. ఆస్తులకు సంబంధించిన ఎటువంటి డాక్యుమెంట్లు, పత్రాలు సీజ్ చెయ్యలేదని తెలుస్తుంది. మరొక వ్యక్తి నివాసంలో 2 కేజీల బంగారం, భారీగా నగదు, మెంటేవారితోటకు చెందిన వ్యక్తి నివాసంలో 2 కేజీల బంగారం డాక్యుమెంట్లు సీజ్ చేసినట్లు సమాచారం. మొత్తం మీద ఐటీ అధికారుల దాడులతో భీమవరం పట్టణంలో సంచలనమైంది. ఈ దాడులతో పట్టణంలో ప్రముఖ వ్యాపారులు, ఉద్యోగులు కంగారు పడ్డారు. కొందరైతే కీలకమైన డాక్యుమెంట్లు నగదును జాగ్రత్తలు చేసుకున్నారని ప్రచారం జరుగుతున్నది.

పంటకు గండం

» అల్పపీడనం ప్రభావంతో మారిన వాతావరణం
» మరో పదిరోజుల్లో మాసూళ్ళు ముమ్మరం అయ్యే అవకాశం
» వర్షాలు పడితే మాసూళ్ళకు అడ్డంకి
» తగ్గనున్న దిగుబడి
» జిల్లాలో తుది దశకు లక్షా 80 వేల ఎకరాల పంట


భీమవరం మండలంలో మాసూళ్ల దశకు చేరుకున్న సార్వా పంట

భీమవరం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సార్వా పంటకు చివరిలో వాతావరణం గండంగా మారింది. అల్పపీడనం ప్రభావంతో సోమవారం మధ్యాహ్నం నుంచి మేఘాలు కమ్ముకున్నాయి. దీంతో రైతులలో కంగారు మొదలైంది. పంట మాసూళ్ళ సమయం దగ్గర పడుతున్న తరుణంలో వర్షాలు పడితే నష్టం తప్పదనే భయం నెలకొంది. గత ఏడాది సార్వా పంట మాసుళ్ళ దగ్గరకు వచ్చిన తరువాత వర్షాలు పంటను నిండా ముంచేసింది. జిల్లా 55 వేల ఎకరాలు భారీగా దెబ్బతింది. దిగుబడి పడిపోయింది. కొన్ని చోట్ల పంట మసూళ్ల చేయలేదు. ఈ ఏడాది సార్వా పంటను ప్రకృతి ఆది నుంచి వర్షాలు రూపేణ ముంచుతూనే వచ్చింది. దాని కారణంగా జిల్లాలో 20 వేల ఎకరాల్లో సాగు నిలిచిపోయింది. 30వేల ఎకరాల్లో సాగు నాట్లు సమయంలో బాగా దెబ్బతింది. చివరికి లక్ష 65వేల ఎకరాల పంట సాగు చివరి దశకు చేరుకున్న సమయంలో వాతావరణం మార్పు నెలకొంది. గత ఏడాదిలా ముంచుతుందనే భయం నెలకొంది. వర్షాలు పడితే వరి చేను నేలకొరగడం.. చేలల్లో నీరు చేరుతుంది. దీంతో పంట మాసుళ్ళు ఆలస్యం, దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉంది. ఈ సమయంలో వర్షాలు పడకుండా ఉంటేనే సాగు గట్టెక్కుతుందని రైతులు చెబుతున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఘనంగా అబుల్ కలాం జయంతి


అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యతో ఉజ్వల భవిష్యత్ ఉందని ఆనాడే గుర్తించిన మహనీయుడు మౌలానా ఆజాద్ నుంచి స్ఫూర్తిని పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి నిర్వహించారు. కలెక్టర్ నాగరాణి ముందుగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత రత్న, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఎంతో ఆదర్శనీయమైందని, వారి కలలను సాకారం చేయడానికి కృషి చేయాలన్నారు. ఇన్‌చార్జి జిల్లా మైనార్టీ అధికారి మూర్తి, డీఈవో కార్యాలయం సహాయ సంచాలకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినతులు పరిష్కరించాలి: కలెక్టర్

భీమవరం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులకు పరిష్కారం చూపడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, రీ ఓపెన్ కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ వినతులను స్వీకరించారు. గత వారం అందిన ఫిర్యాదుల పరి ష్కారం, తాజా పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సోమవారం ప్రజల నుంచి సమస్యలపై 164 వినతులు అందాయి. వాటిలో కొన్ని ఫిర్యాదులు ఇలా ఉన్నాయి.

ఆక్రమణలు తొలగించాలి

గుబ్బల సత్యనారాయణ, నౌడూరు

వీరవాసరం మండలం నౌడూరు గ్రామం సెంటరు చుట్టుపక్కల గ్రామపంచాయతీలకు ముఖ్య కూడలిగా ఉన్నది. ఈ గ్రామంలో ఆర్ అండ్ బి రహదారి ఇరువైపులా ప్రభుత్వ స్థలం ఆక్రమణలు చేసి షాపులు నిర్వహిస్తున్నారు. రహదారి వెంబడి వెళ్లే వాహనాలకు అంత రాయం కలుగుతున్నది తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యాపారస్తులు వ్యర్థాలను పక్కనే ఉన్న మురుగకాల్వలో వేస్తుండ డంతో నీరు కలుషితమై దుర్గంధం వెదజల్లుతున్న ది. అధికారులు వెంటనే చర్యలు తీసువాలి.

పశువుల చెరువును ఆక్రమించి..

ఆర్.శక్తీశ్వరరావు- కొమరాడ

గ్రామానికి చెందిన పశువుల చెరువు గట్టును ఆక్రమించుకుని సెప్టిక్ ట్యాంకులు నిర్మిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని భీమవరం మండలం కొమరాడ గ్రామంకు చెందిన ఆర్.శక్తి శ్వరరావు ఫిర్యాదు చేశారు.

ప్రాణహాని ఉంది

హేమలత- కలిసిపూడి

తన పేరును ఉన్న ఇంటిని తన మరిది కుమారుడు దౌర్జన్యంగా అతని పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, అతని వలన తనకు ప్రాణహాని ఉన్నదని, ఆ అతని నుంచి రక్షణ కల్పించాలని ఉండి మండలం కలిసిపూడి గ్రామానికి చెందిన 68ఏళ్ళ కాకరాల హేమలత ఫిర్యాదులో కోరారు.

పోలీసు శాఖకు ఏడు ఫిర్యాదులు

భీమవరం క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో త్వరితగతిన విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తామని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ భీమారావు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వారి సమస్యలను స్వయంగా అదనపు ఎస్పీకి విన్నవించుకుని రాతపూర్వకమైన అర్జీలను అందజేశారు. భూవివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు వంటి పలు సమస్యలపై ఏడుగురు ఫిర్యాదిదారుల వారి సమస్యలను విన్నవించుకున్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ

హరోం హర

శివ నామస్మరణతో మార్మోగిన శివాలయాలు



భీమవరంలో దీపాల పూజలో భక్తులు..పట్టిసీమ వీరేశ్వరస్వామికి అభిషేకం



ఏలూరులోని ఫత్తేబాద చాడేశ్వరి రామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు

భీమవరం టౌన్, పాలకల్లు అర్బన్ పోలవరం నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం రెండో సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. పంచారామ క్షేత్రాలు, పట్టిసీమ క్షేత్రానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. పంచారామ క్షేత్ర మైన గునుపూడి సోమేశ్వరస్వామి తెల్లవారుజామున ఆలయ అర్చకులు చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించిన అనంతరం దర్శనం కల్పించారు. స్వామివారికి 9 లక్షల 58 వేల 732 రూపాయలు ఆదాయంగా వచ్చిందని ఈవో రామ కృష్ణంరాజు తెలిపారు. స్వామివారిని దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వి రమేష్ బాబు దర్శించుకున్నారు. సోమేశ్వరస్వామి నిత్యన్న దానం ట్రస్టు ఆధ్వర్యంలో మానేపల్లి వారి కుటుంబం, కరిశేటివారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో భక్తులకు అన్నదానం చేశారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు) అన్నసమారాధన ప్రారంభించారు. వన్‌టౌన్ సీఐ నాగరాజు పర్యవేక్షించారు.

ఓం నమశివాయ నామస్మరణతో క్షీరా రామ లింగేశ్వరస్వామి ఆలయం మారు మోగింది. వివిధ ప్రాంతాల నుంచి సుమారుగా 30 వేల మంది వరకూ స్వామివారిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాల సమాచారం. రేపాక వారి సత్రంలో భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. క్షీరా రామ లింగేశ్వర స్వామిసేవాసమితి,యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు బాదం పాలు అందించారు. సోమవారం మధ్యాహ్నం ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డీఎస్పీ మురళీ కృష్ణ ఉన్నారు.

పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.తెల్లవారుజామునే ఫెర్రీ రేవులో స్నానాలాచరించి గోదావరిలో కార్తీక దీపాలు వదిలారు. అనంతరం వీరేశ్వరస్వామిని







గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు.. స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన అఘోరి.. క్షీరారాముని దర్శించుకున్న ఐజీ అశోక్ కుమార్



దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న క్షేత్ర పాలకుడు భావన్నారాయణ స్వామి భద్రకాళీ, తాండవ భద్రుడు, నవగ్రహాలు, కాలభైరవడు, సీతారామచంద్రస్వామి, ఆంజనేయులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంచారామాలను దర్శించుకున్న అఘోరీ

పంచారామ క్షేత్రాలైన గునుపూడి సోమేశ్వరస్వామి, క్షీరా రామ లింగేశ్వర స్వామిలను సోమవారం సాయంత్రం అఘోరీ దర్శించుకున్నారు. ఆమె పర్యటనలు ఇటీవల కొంత వివాదస్పదంగా ఉండటంతో దేవాలయం వద్ద ఉన్న పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆమె దర్శనం చేసుకుని వెళ్ళేవరకు జాగ్రత్తలు వహించారు.



చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.2.04 కోట్లు

ద్వారకాతిరుమల, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): చిన్నతిరుమలేశునికి హుండీల లెక్కింపు ద్వారా మంచి ఆదాయం సమకూరింది. కేవలం 21 రోజుల కాలానికి గాను నగదు రూపేణా రూ2.04 కోట్ల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సత్యన్నారాయణమూర్తి తెలిపారు. ప్రమోద కల్యాణమండప ఆవరణలో సోమవారం భద్రతాఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపు నిర్వహించారు. 2,04,67,691 రూపాయల నగదుతో పాటుగా భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 234 గ్రాముల బంగారం, 4.998 కేజీల వెండి లభించినట్లు ఈవో వివరించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (8), 2000(9)తో పాటు విదేశీ కరెన్సీ లభించింది.

అలరించిన శోభారాజ్ బృంద నగర సంకీర్తన



ద్వారకా తిరుమల, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): చినవెంకన్న క్షేత్రంలో అన్నమాచార్య భావనా వాహినీ వ్యవస్థాపకురాలు, ప్రముఖ గాయని డాక్టర్ శోభారాజ్ ఆధ్వర్యంలో నగర సంకీర్తనను నిర్వహించారు. ఆగమ విద్యార్థులు, శోభారాజ్ శిష్య బృందం పాల్గొన్నారు. ముందుగా ఆలయ పాదుకామండపం వద్ద స్వామివారి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేకపూజలు జరిపారు. ముందుగా గజలక్ష్మి నడుస్తుండగా ఆగమ విద్యార్థులు శ్రీవారి చిత్రపటం పట్టుకుని శిష్యబృందం, శ్రీవారి కీర్తనలను ఆలపిస్తూ క్షేత్రంలో తిరిగారు.ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించారు. ఆలయ ప్రాంగణంలో అన్నమయ్య కీర్తనలను ఆలపించారు.

రేపు శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం.. చురుగ్గా ఏర్పాట్లు




ద్వారకాతిరుమల, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన నృశింహ సాగరం (సుదర్శన పుష్కరిణి)లో బుధవారం రాత్రి తెప్పోత్సవ నిర్వహణకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. పుష్కరిణిని సుందరీక=రించేందుకు, అందులోని తూడును మొత్తం సిబ్బంది తొలగించారు. సాగర పరిసరాలను విద్యుత్ దీపతోరణాలతో అలంకరిస్తున్నారు. సాగరం చుట్టూ ఫెన్సింగ్ నిర్మించారు. పుష్కరిణి మధ్యలో ఉన్న మండపాన్ని రంగులతో ముస్తాబు చేస్తున్నారు. పుష్కరిణిలోని మురుగు నీటిని తొలగించి పైపుల ద్వారా కొత్తనీటి ని నింపారు.ఉభయనాంచారులతో కొలువైన శ్రీవారు బుధవారం సాయంత్రం తొళక్క వాహనంపై తిరువీధుల్లో ఊరేగి తర్వాత రాత్రి 8 గంటల ప్రాంతంలో పుష్కరిణి వద్దకు చేర కుంటారు. అనంతరం తెప్పోత్సవం జరుగుతుందని భక్తులు రావాలని ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి కోరారు.



సైకిళ్లపై శబరిమలై యాత్ర

పాలకొల్లు అర్బన్, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): పాలకొల్లు అయ్యప్పస్వామి ఆలయం వద్ద గల గురుపీఠంలో గురుస్వామి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 17 మంది అయ్యప్ప భక్తులు ఆలయం వద్ద నుంచి సైకిళ్లపై శబరిమల బయలు దేరారు. సుమారు 15 నుంచి 18 రోజుల్లో శబరిమలైకి చేరుకునే విధంగా ప్రణాళిక చేసుకున్నట్టు గురుస్వామి తెలిపారు.



సందర్శకులతో కిటకిటలాడిన బౌద్ధారామాలు

కామవరపుకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) :కార్తీకమాసం ప్రతీ సోమవారం కామవరపుకోట మండలం జీలకర్రగూడెం గట్టుపై గల బౌద్ధారామాలను వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సందర్శించుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. గట్టుపై గల బౌద్ధుల చైత్యాలు, బౌద్ధగుహలు, ప్రాచీన కట్టడాలు, పాలరాతి బౌద్ధ స్థూపాన్ని సందర్శించారు. గట్టుపై గల ఏకశిలా నిర్మితమైన కొండల్లో మలిచిన ధర్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మహిళలు సంతాన ప్రాప్తికై దీక్షలు నిర్వహించారు. దాదాపు వెయ్యి మంది సందర్శించినట్టు అంచనా. సందర్శకులతో ఆ ప్రాంత మంతా కిటకిటలాడింది.

నిశ్శబ్ద న్యూమోనియా





ఏలూరు క్రైం/ భీమవరం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ఎక్కువగా గుండెకు సంబంధించిన వ్యాధులతో మరణించే వారి సంఖ్య తరువాత న్యూమోనియా రెండో స్థానంలో ఉంది. ఎక్కువగా చిన్నపిల్లల్లో ఈ వ్యాధి కనిపిస్తుంది. చిన్న పిల్లల్లో 5 సంవత్సరాల లోపు మరణించే వారిలో 50 శాతం ఈ వ్యాధితోనే మరణిస్తున్నారు. కొద్ది పాటి జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఈ వ్యాధి నుంచి దూరం కావచ్చు. నేడు ప్రపంచ న్యూమోనియా దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక కథనం

న్యూమోనియా అంటే

ఊపిరితిత్తులు గాలి సరిగా పీల్చుకోవడానికి వీలులేకుండా అక్కడ తేమ ఏర్పడడం వల్ల ఊపిరి పీల్చుకోలేక ఇబ్బంది పడుతూ ఉంటారు. పెద్దల్లో అయితే ఆయాస పడుతూ ఉంటారు. పిల్లల్లో అయితే డొక్కలు ఎగరవేస్తూ ఉంటారు. శ్వాస పీల్చుకోవడం ఎంతో బాధాకరంగా ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు ప్రకారం భారతదేశంలో న్యూమోనియా వ్యాధి నిర్ధారణ అయి మరణించిన వారు 10.2 శాతం ఉన్నారు. వివిధ వ్యాధితో మరణించిన పిల్లల్లో 15 శాతం ఈ వ్యాధితోనే మరణించారు. ఇది ఎక్కువగా చిన్నపిల్లలు, 60 ఏళ్ళ పైబడిన వారిలో కనిపి స్తుంది. శీతాకాలం, వేసవి కాలంలోనూ ఊపిరితిత్తులకు తేమ ఎక్కువై శ్వాసతీసు కోవడం కష్టంగా మారుతుంది. అంతేకాకుండా దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి కూడా ఈ వ్యాధి వస్తుంది. ధూమ పానం అలవాటు ఉన్నవారికి, వారి కుటుంబ సభ్యులకు కూడా వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంది. వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ వ్యాధి ప్రబలు తుంది. ఇంట్లో ఉండే పెంపుడు జంతువులు అయిన పిల్లి, కుక్కల వల్ల సోకే ప్రమాదం ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ వ్యాధిబారినపడి ఆసుపత్రికి వెళ్ళే వారి సంఖ్య ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు కలిపి వెయ్యి నుంచి పదిహేను వందల మంది ఉంటున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి రోజుకు 100 మంది వరకూ ఈ వ్యాధి గ్రస్తులు వస్తున్నారని ఆసుపత్రి రికార్డుల ప్రకారం తెలుస్తోంది.

వ్యాధి లక్షణాలు



జ్వరం, కఫంతో కూడిన దగ్గు, చలి, వణుకు ఉండడం, ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో కష్టంగా ఉండడం, బలహీనంగా, నీరసంగా శక్తి తక్కువగా ఉండడం అనిపించడం, వికారం, వాంతులు, విరోచనాలు, గందరగోళ పరిస్థితి కనిపించడం. సాధారణ ఉష్ణోగ్రత కంటే తక్కు వగా ఉండడం వంటి లక్షణాలు ప్రధానంగా కనిపిస్తాయి. చిన్న పిల్లల్లో అయితే నోరు తెరిచి గాలిపీల్చుకోవడం, డొక్కలు ఎగురవేయడం స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా నవజాతి శిశువులు రెండు నెలలోపే ఈ వ్యాధి ఎక్కువగా వస్తూ ఉంటుంది. ఒకరి నుంచి ఒకరికి ఈ వ్యాధి సోకుతుంది. తుమ్మడం వల్ల క్రిములు గాలిలో కలవడం, ఆ గాలిని వేరే వారు పీల్చుకోవడంతో వ్యాధి ప్రబలే అవకాశం ఉంది.

మరణాల్లో రెండోస్థానం

కొద్దిపాటి జాగ్రత్తలతో వ్యాధికి దూరం

పిల్లలు, వృద్ధులు జాగ్రత్త

నేడు ప్రపంచ న్యూమోనియా దినోత్సవం



జాగ్రత్తలు అవసరం

రెండు సంవత్సరాలలోపు పిల్లలకు న్యూమోనియా ఎక్కువగా ఉంటుంది. పిల్లలకు నిర్ధిష్టమైన సమయంలో అవసరమైన వ్యాక్సిన్లు వేయించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెంచి వ్యాధులు రాకుండా కాపా డుకోవచ్చు. ఆరు నెలల వరకూ తల్లి పాలు ఖచ్చితంగా ఇస్తే బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. పొగకు దూరంగా ఉండడం, పౌష్టికాహార లోపాన్ని నిరోధించడం, రద్దీ ప్రదేశాల్లో ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలి. సాధారణంగా వృద్ధుల్లో అయితే తరచుగా వైద్యుల వద్దకు వెళ్ళి వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎక్సరే మరికొన్ని రక్త పరీక్షల ద్వారా ఈ వ్యాధిని గుర్తిస్తారు. వ్యాధి స్టేజ్‌ని బట్టి వైద్యం ఉంటుది.. ఫస్ట్ స్టేజీలో ఉంటే యాంటీ బయోటిక్స్ ద్వారా నయం చేసే అవకాశం ఉంటుంది. అదే థర్డ్ స్టేజ్‌లో ఉంటే తప్పనిసరిగా వైద్యుల సంరక్షణలో ఉండి వైద్యం చేయించుకోవలసి ఉంటుంది.

జాగ్రత్తలతోనే దూరం



న్యూమోనియా వ్యాధి సోకకుండా ఉండాలంటే పరిశుభ్రత ఎంతో ముఖ్యం. ఇళ్లల్లో దుమ్ము, ధూళి లేకుండా చూడాలి. వాహనాలపై ప్రయాణించే వారు మాస్క్ ధరించాలి. జ్వరం, ఆయాసం, దగ్గు, ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉందంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. శీతాకాలంలో గోరు వెచ్చని నీరు తాగాలి. కుక్కలు, పిల్లలు వంటి వాటికి దూరంగా ఉండాలి. వ్యాధిగ్రస్తులకు యాంటీబయోటిక్ ఇంజక్షన్ ద్వారా ఐదు నుంచి 8 రోజుల్లో తగ్గిపోతుంది. పిల్లలో అయితే మూడు వారాల లోపు తగ్గిపోతుంది. పొగ తాగేవారికి దూరంగా ఉండాలి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాలి. ఎప్పుడైతే వ్యాధినిరోధక శక్తి తగ్గుతుందో ఈ వ్యాధి ప్రబలే అవకాశం ఉంది. మనం తీసుకునే జాగ్రత్తలతోనే మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

- డాక్టర్ ఎం.సుమన్, అత్యవసర విభాగపు వైద్య నిపుణులు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఏలూరు

వృద్ధులకు ఎక్కువగా వచ్చే అవకాశం..



న్యూమోనియా వ్యాధి ఎక్కువేగా పెద్దలకు వచ్చే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలిక రోగులు జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకుంటే మంచిది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఏ మందులు పడితే అవి వాడటం మంచిది కాదు. వ్యాధి తీవ్రత పెరిగితే ఇబ్బందులు తప్పవు.. అందుకే జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా బయటకు వెళ్తుంటే తప్పనిసరిగా మాస్కు ధరించటం, ఇంటికి రాగానే చేతులను శుభ్రంగా వాష్ చేసుకోవటం చాలా మంచిది. వైరల్ న్యూమోనియాలు ఎక్కవగా ఉన్నాయి.

డాక్టర్ ఎస్.భార్గవ రామ్, ఊపిరితిత్తులు, శ్వాస కోశ వ్యాధుల వైద్య నిపుణుడు, భీమవరం హస్పటల్స్



ఆకివీడులో ఆదర్శంగా అన్న క్యాంటీన్

పేదలకు ఉచిత భోజనం

ఆకివీడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అన్నం పరబ్రహ్మస్వరూపం. పట్టెడన్నం కోసం అందరం కష్టపడుతుంటాం. పేదల ఆకలి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసింది. టీడీపీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ మాజీ కన్వీనర్ గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు ఆర్థిక సహాకారంతో సుమారు రోజుకు 400 మంది పేదలకు ఉచితంగా పసందైన వంటకాలతో భోజనం అంది స్తున్నారు. సత్యనారాయణరాజు తండ్రి వెంకట సుబ్బరాజు దగ్గర నుంచి పార్టీకి అండగా ఉం టూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పార్టీ చేపట్టే ప్రతీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. సత్యనారాయణ రాజు ఇటీవల మంగళగిరిలో సీఎం చంద్రబాబును కలిసి సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్ళారు.







హోరాహోరీగా అంతర్ యూనివర్శిటీ జూడో పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం డీఆర్ గోయెంకా కళాశాలలో సోమవారం నన్నయ్య యూనివర్శిటీ అంతర్ కళాశాలల జూడో పురుషులు, మహిళల పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను వైస్‌ప్రిన్సిపాల్ ప్రసాద్ ప్రారంభించారు.





తాడేపల్లిగూడెం, ఏలూరుల్లో హీరో వరుణ్‌తేజ్ సందడి

మట్కా చిత్ర యూనిట్ సందడి

ఏలూరు రూరల్/ తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరుణ్‌తేజ్ హీరోగా కరుణ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన మట్కా సినిమా ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా సోమవారం సాయంత్రం హీరో వరుణ్‌తేజ్, హాస్యనటుడు రాజేష్, ఏలూరులో సందడి చేశారు. పాత బస్టాండ్ దగ్గర నుంచి నడుచుకుంటూ కొత్త బస్టాండు సమీపంలో ఉన్న ఎస్‌వీసీ థియేటర్‌కు విచ్చేశారు. సినిమా ట్రైలర్‌ను ప్రేక్షకులతో కలిసి తిలకించారు. కొద్దిసేపు సినిమాలోని డైలాగులు చెప్పి అలరించారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ మట్కా చిత్రం విభిన్నంగా ఉంటుందని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆదరిస్తుందన్నారు. పాత బస్టాండు నుంచి నడుచుకుంటూ మధ్యమధ్యలో అభిమానులను పలుకరిస్తూ వరుణ్‌తేజ్ సందడి చేశారు.సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఎగబడ్డారు. తాడేపల్లిగూడెం మండలం పెద తాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో సందడి చేశారు. తనకు పశ్చిమ గోదావరి జిల్లా అంటే ఎంతో అభిమానమన్నారు. మన సొంత ప్రాంతం అంటే ఎవరికైనా ఇదే ఫీలింగ్ ఉంటుందన్నారు. కళాశాల అధ్యక్ష కార్య దర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ రాష్ట్ర వాలీబాల్ టీంలో పోసియ్య



ఎంపికైన టీం సభ్యులతో పోసియ్య

పెంటపాడు, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి) : సివిల్ సర్వీసెస్ రాష్ట్ర వాలీబాల్ టీంలో పెంటపాడు పోస్టు బేసిక్ పాఠశాలలో బయాలజీ టీచర్‌గా సేవలందిస్తున్న పోసియ్య ఎంపికయ్యారు. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ 2024-25 జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఈ నెల 9వ తేదీన విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలో నిర్వ హించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టు పోటీలలో పోసియ్య ఎంపికయ్యారు. త్వరలో జాతీయ స్థాయిలో పూణెలో జరగబోయే వాలీబాల్ పోటీలలో రాష్ట్రానికి చెందిన 12 మంది టీంలో పోసియ్య ఒకరు. ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, టీవీ రామకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ కళింగ లక్ష్మణరావు, హెచ్ఎం రాజేష్ అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా
ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ

ఏలూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 650 మంది ఎన్‌సీసీ కేడెట్లకు ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు నల్లజర్లలోని ఏకేఆర్‌జీ ఉన్నత పాఠశాల మైదానంలో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు 19 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే తెలిపారు. 2026లో ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఉమ్మడి జిల్లా నుంచి కెడెట్ల ప్రాబబుల్స్‌ను ఎంపికచేయడంతోపాటు, వివిధ రకాల శిక్షణలు ఇస్తామని వివరించారు. వచ్చే ఏడాది జరుగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు ఎన్‌సీసీ కెడెట్లు ఎంపికయ్యారని, వీరికి ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తున్నారన్నారు.

రిటైర్డ్ మున్సిపల్ టీచర్ల పీఎఫ్ చెల్లింపునకు ఉత్తర్వులు

ఏలూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా శాఖ పరిధిలోకి మున్సిపల్ పాఠశాలలను విలీనం చేసిననాటి నుంచి ఉద్యోగ విరమణ చేస్తున్న మున్సిపల్ టీచర్లకు ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) చెల్లించడంలో ఏర్పడిన ప్రతిష్ఠంభనను తొలగించింది. ఇందుకు సంబంధించి పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని తెలుగుదేశం పార్టీ అనుబంధ ఉపాధ్యాయ సంఘం నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్టీఏ) నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, సాయి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు కార్పొరేషన్, మున్సిపాల్టీల వద్ద పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ ప్రతిపాదనలకు నిధులు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినందున ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ చర్యలు చేపట్టాలని సంఘ జిల్లా చైర్మన్ నెరుసు రాంబాబు డిమాండ్ చేశారు. గతేడాది జూలై నుంచి ఈ ఏడాది మే నెల వరకు నగరపాలక సంస్థలో ఎనిమిది మంది ఉపాధ్యాయులు రిటైర్ అయ్యారని, వీరందరికీ పీఎఫ్ వెంటనే చెల్లించాలని కోరారు.

టీచర్లకు శిక్షణ
నాన్ రెసిడెన్షియల్లోనేనా..?

18 నుంచి మూడోవిడతకు సన్నాహాలు

ఏలూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాయకత్వ లక్షణాలపై హెచ్‌ఎంలకు, ఎఫ్‌ఎల్‌ఎన్ పేరిట ఎస్జీటీలకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో మూడో విడత శిక్షణ ఈ నెల 18 నుంచి ఆరు రోజుల పాటు ఇవ్వడానికి నిర్ణయించారు. శిక్షణకు ఎంపిక చేసిన హెచ్‌ఎంలు, ఎస్జీటీల జాబితాలను సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయ వర్గాలు విడుదల చేస్తాయి. జిల్లాకు సంబంధించి అగిరిపల్లిలోని హీల్ ప్యారడైజ్ స్కూలులో నిర్వహిస్తోన్న శిక్షణ తరగతులకు హాజరైన ఉండి మండలానికి చెందిన ఓ హెచ్‌ఎం ఇటీవల గుండెపోటుతో ఆకస్మిక మృతి చెందడంతో, ఆ సంఘటనపై ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో నిలిపివేసిన విషయం విదితమే. మరోవైపు ఇకమీదట ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణ తరగతులను నాన్-రెసిడెన్షియల్ విధానంలోనే ఆయా జిల్లాల్లోనే నిర్వహిస్తామని పాఠశాల విద్య ఉన్నతాధికారులు హామీ ఇచ్చినట్టు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే మూడోవిడత నిర్వహించనున్న శిక్షణపై సందిగ్ధత నెలకొంది. దీనిపై సమగ్రశిక్ష అధికార వర్గాలను వివరణ కోరగా తమవద్ద ఎటువంటి సమాచారం లేదని పేర్కొన్నాయి.

అంగన్వాడీ కేంద్రాల్లో
కిచెన్ గార్డెన్స్

ద్వారకాతిరుమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు, కౌమార దశలోని బాలికలకు పోషకాహార లోపం నివారణకు అంగన్వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేస్తున్నామని సీడీపీవో పి.బ్యూలా తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం అంగన్వాడీ 2.0 సమీకృత పోషకాహార మద్దతు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఈ కిచెన్ గార్డెన్స్ ద్వారా కూర గాయలు, ఆకు కూరలు, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా పెంచడం కోసం ఉద్యాన శాఖ నేచురల్ పామింగ్ వారి సహాయ సహకారాలు తీసుకుంటామన్నారు. పిల్లల అభివృద్ధిని ప్రోత్సహించేందుకు శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయాన్ని సాధిస్తామన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ కె.రాజు, ఉద్యానశాఖ అధికారి దేవదానం, నేచురల్ పార్మింగ్ మండలాధికారి సుబ్బారావు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

వైసీపీ జడ్పీటీసీల నిరసనలతో
హోరెత్తిన జడ్పీ

- సమావేశం రద్దయిన విషయం తమకు తెలియదన్న ప్రజాప్రతినిధులు
- మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారని జడ్పీ సీఈవోను చుటుముట్టి నిలదీత
- జడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ.. ప్రత్యేక సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి
- ఎన్నికల కోడ్ అనంతరం సమాచారం ఇచ్చి సమావేశం నిర్వహిస్తాం.. కలెక్టర్
- నిరసన విరమించిన వైసీపీ జడ్పీటీసీ సభ్యులు


రాత పూరకంగా తేదీ చెప్పాలని జడ్పీ సీఈవోను మీటింగ్ హాల్లో చుట్టుముట్టిన వైసీపీ జడ్పీటీసీలు

ఏలూరు సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక సమావేశం ఎన్నికల కోడ్ కారణంగా రద్దయింది. అయితే ఆ విషయం తమకు తెలియదంటూ సోమవారం వైసీపీ జడ్పీటీసీలు ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. దీంతో వైసీపీ జడ్పీటీసీల నిరసనలతో జిల్లా పరిషత్ హోరెత్తింది. ఈ నెల 8న స్టాండింగ్ కమిటీల సమావేశం నిర్వహించి, ఇప్పుడు ప్రత్యేక సమావేశానికి ఎన్నికల కోడ్ ఏమిటని పలువురు జడ్పీటీసీలు ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఇటువంటి సమావేశాలు నిర్వహించవద్ద కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక సమావేశాన్ని రద్దు చేశామని, ఈ విషయాన్ని జడ్పీటీసీలకు సోమవారం రాత్రి తెలిపామని జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఎప్పుడు ఈ ప్రత్యేక సమావేశం నిర్వహించేది రాత పూరకంగా తేదీ చెప్పాలని కోరారు. సమావేశ తేదీ చెప్పలేమని అన్నారు. దీంతో జడ్పీ సీఈవో సమాధానాలు రుచించకపోవటంతో వైసీపీ జడ్పీటీసీలు జడ్పీ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకరంగా నినాదాలు చేసుకుంటూ కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి మీ కోసం కార్యక్రమంలో ఉన్న కలెక్టర్ కె.వెట్రిసెల్విని కలిశారు. ఎన్నికల కోడ్ అనంతరం జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని, సమావేశ సమయం ఉదయం 9 గంటలకు కాకుండా 11 గంటలకు నిర్వహించాలని వారు కోరారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పడంతో జడ్పీటీసీల నిరసన కార్యక్రమం ముగిసింది. ఈ నిరసన కార్యక్రమంలో 35 మంది జడ్పీటీసీల వరకు పాల్గొన్నారని చెబుతున్నారు.

తెలియదనడం సరికాదు
జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పద్మశ్రీప్రసాద్

ఎన్నికల కోడ్‌తో ప్రత్యేక సమావేశం రద్దయిందని, ఈ సమాచారాన్ని జడ్పీటీసీ సభ్యుల గ్రూప్‌లో పెట్టామని, అయినా తమకు తెలియదని వారు చెబుతుండడం సరికాదని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. జడ్పీ క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జడ్పీటీసీలు అందరూ ప్రజా సేవ చేస్తారనే ఉద్దేశ్యంతో ప్రజలు గెలిపించారని , వారికి ప్రజా సేవ చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఇంకా రెండేళ్లు ప్రజలకు సేవ చేసుకునే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో తనకు జడ్పీ చైర్ పర్సన్‌గా బి ఫారం ఇచ్చినప్పుడు కూడా అడ్డుకున్నారన్నారు. ఒక బీసీ మహిళగా తనకు అవకాశం రాకుండా చూశారని, ఇప్పుడు వారే జడ్పీటీసీలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. జడ్పీటీసీలు అందరూ తనకు సహకారించాలని ఆమె కోరారు. వీరవాసరం జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్ నాయుడు, ఆచంట జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన శిక్షలు


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరమని, ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్ ఏలూరులోని సీహెచ్ఎస్‌డీ సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాలలో సోమవారం బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల నిరోధం అంశంపై విద్యార్థునులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్ళు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే సంబంధిత అధికారులకు తెలిజేయాలని సూచించారు. విద్యార్థుల లక్ష్యంగా పాఠశాలలు, కళాశాలల ప్రాంతాల్లో సంఘ విద్రోహ శక్తులు వివిధ రూపాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల అలవాటు చేస్తున్నారన్నారు. ట్రైనీ జూనియర్ సివిల్ జడ్జీలు వి.రఘునాధ్, టీఎస్ఎస్ఆర్ ఆదిత్య రిషిక్, ఏవీ నాగరాజు, కె.స్పందన, జేబీటీ ఎస్ దేవి, కుమారి, డి.అరుంధతి సోషల్ వర్కర్ ఎం.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

తొలిరోజు
నామినేషన్లు నిల్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు జిల్లా రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం నోటిఫి కేషన్ విడుదల చేశారు. ఈనెల 18 వరకు నామి నేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 19వ తేదీ నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3గంటల లోపు నామినేషన్లు ఉపసం హరించుకోవాలన్నారు. డిసెంబరు 5న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. తొలిరోజు సోమవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

ట్రైనీ అధికారుల పర్యటన



భీమవరం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శిక్షణ నిమిత్తం భీమవరం వచ్చిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ తదితర కేంద్ర సర్వీసుల శాఖ ట్రైనీ అధికారులు పట్టణంలోని పీఎస్ఎం బాలికల పాఠశాలలో విద్యా విధానంపై పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఇక్కడి విద్యావిధానంపై విద్యాశాఖాధికారలు వారికి వివరించారు. ఉద యం మెప్మాకు సంబంధించి మునిసిపల్ కార్యాలయంలో విభాగాన్ని పరిశీలించారు. మహిళలు పచ్చడి తయారీ విధానాన్ని స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రరావు, అధికారులు ఉన్నారు.

'పది' పరీక్షలు
తెలుగులోనూ రాయొచ్చోచ్!

- ఇంగ్లీషు మీడియంలో పరీక్ష ఇక విద్యార్థి అభీష్టానికే
- జగన్ ప్రభుత్వ బలవంతపు రుద్దుడు నుంచి ఉపశమనం
- ఇప్పటికే పరీక్ష ఫీజు కట్టిన వారికి ఎడిట్ ఆప్షన్

ఏలూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను వేదిస్తోన్న మాధ్యమం (మీడియం) భయాందోళనలకు ఎట్టకేలకు తెరపడింది. టెన్త్ పరీక్షలకు ఖచ్చితంగా ఆంగ్ల మాధ్యమంలోనే రాయాల్సి ఉంటుందని వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో ఈ దఫా పరీక్షల్లో ఉత్తీర్ణత తగ్గటం ఖాయమని ఉపాధ్యాయ వర్గాలు, అంతగా పట్టులేని ఇంగ్లీషు మాధ్యమంలో పరీక్ష ఎలా రాయగలమని ఇటు విద్యార్థులు తీవ్ర ఆందోళనలోవున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో అందరికీ ఊరట కలిగించేలా విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఇక ఈ నిర్ణయంపై ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడటమే మిగిలిఉంది. ఆ ప్రకారం ఇప్పటికే వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న టెన్త్ పరీక్షలకు ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించేటపుడే విద్యార్థి అభీష్టాన్నిబట్టి ఇంగ్లీషు లేదా తెలుగు మీడియం ఎంచుకునే వెసులుబాటును తాజాగా కల్పించారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ వర్గాలు ధ్రువీకరించాయి. తాజా వెసులుబాటును బట్టి తెలుగు మీడియంలోనే పరీక్ష రాయదలుచుకున్న విద్యార్థులు ఇక ఎటువంటి ఆందోళనకు గురికా కుండా పరీక్షకు ప్రిపేర్ కావచ్చు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఈ దఫా సుమారు 49,500 మంది విద్యార్థులుంటారని అంచనా. ప్రస్తుతం జరుగుతున్న పరీక్ష ఫీజు చెల్లింపుల ప్రక్రియ ముగిస్తే పరీక్షార్థుల సంఖ్యపై స్పష్టత వస్తుంది. ఏలూరు జిల్లాలో సుమారు 23,500 మంది ఉండవచ్చునని తెలిసింది.



త్వరలో ఎడిట్ ఆప్షన్

ఇంగ్లీషు మీడియంలో టెన్త్ పరీక్షలు నిర్వహిస్తే ఉత్తీర్ణత అమాంతం పడిపోవడం ఖాయమని ఉపాధ్యాయ వర్గాలు ఎప్పటి నుంచో మొత్తుకుంటున్నా జగన్ ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. వాస్తవానికి ఇంగ్లీషు మీడియంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'సక్సెస్' ఉన్నత పాఠశాలల్లో మాత్రమే ఇంగ్లీషు మీడియంలో బోధన జరుగుతోంది. ఇటువంటి 'సక్సెస్' హైస్కూళ్ళు ఏలూరు జిల్లాలో 25 మాత్ర మే ఉన్నాయని విద్యాశాఖవర్గాలు పేర్కొంటున్నాయి. మిగతావన్నీ తెలుగు మాధ్యమ ఉన్నత పాఠశాలలే. ఈ విషయాలను పట్టించుకో కుండానే జగన్ ప్రభుత్వం 8, 9, 10 తరగతులకు ఆంగ్ల మాధ్యమాన్ని తప్పని సరిచేస్తూ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా పాఠ్యపుస్తకాలను తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పేజీకి ఇరువైపులా ముద్రించి పంపిణీ చేసినందున పరీక్షలు రాయడానికి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఉండబోవని వైసీపీ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలను రుద్దింది. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థుల సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు, బలవంతంగా విద్యార్థులపై మోపిన ఇంగ్లీషు మీడియం వల్ల జరుగనున్న అనర్థాలను గమనించింది. ఈ క్రమంలోనే వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలోనే ఖచ్చితంగా రాయాలన్న నిబంధనను సడలించి తెలుగు మాధ్యమంలో కూడా పరీక్షలు రాసేందుకు వెసులుబాటు కల్పించింది.

కాగా ఇప్పటికే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల నుంచి ఫీజును ఆన్‌లైన్ విధానంలో స్వీకరించే ప్రక్రియ జరుగుతున్నందున ఏ మాధ్యమంలో పరీక్ష రాస్తారో విద్యార్థే ఎంచుకునే అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆన్‌లైన్ విధానంలో పరీక్ష ఫీజు చెల్లించి, ఇంగ్లీషు మీడియంలో పరీక్ష రాసేందుకు అంగీకారం తెలిపిన విద్యార్థులు సైతం తాము తెలుగు మాధ్యమంలో పరీక్ష రాయదలుచుకుంటే ఆ మార్పును తెలియజేసేందుకు ఎడిట్ ఆప్షన్‌ను కొద్ది రోజుల్లో ఇవ్వనున్నారు. మరోవైపు ఫీజు చెల్లించిన విద్యార్థుల డేటాను నామినల్ రోల్స్ (ఎన్ఆర్) రూపంలో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జిల్లా విద్యా శాఖ ద్వారా ప్రభుత్వానికి అందజేసే గడువు ఇంకా ముగియనందున, ఆ లోగా ఇంగ్లీషు మీడియంను ఎంచుకుని ఇపుడు తెలుగు మాధ్యమానికి ఆప్షన్ ఇచ్చుకునేందుకు విద్యార్థులకు వెసులు బాటుతోపాటు, ఎన్ఆర్ లలో నమోదుకు అవకాశం ఉందని డీఈవో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఇదే విషయాన్ని ఉపాధ్యాయులకు సూచిస్తున్నట్టు అధికార వర్గాలు వివరించాయి. కాగా ఇంగ్లీషు స్థానే తెలుగు మాధ్యమంలో పరీక్షరాసేందుకు వెసులుబాటు కల్పిస్తూ సంబంధింత అధికారిక ఉత్తర్వులు ఇంతవరకు లేవు.

యాప్‌ల్లో నష్టపోతే మూడు గంటల్లో రికవరీ

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్


మొగల్తూరు స్టేషన్ వద్ద గౌరవ వందనం సీకరిస్తున్న ఐజీ అశోక్ కుమార్

మొగల్తూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైంలో నగదు నష్టపోయిన వారు టోల్ ఫ్రీ నంబర్ 1903కి ఫిర్యాదు చేస్తే మూడు గంటల్లో ఆ నగదు ట్రాన్స్‌ఫర్ కాకుండా సహాయ పడేందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్టు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవరం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి విలేకరులతో మాట్లాడారు. నష్టపోయిన బాధితుడి ఖాతాను బ్యాంకు అధికారులతో లాక్ చేయించి ఆ నగదును కోర్టు ద్వారా బాధితుడికు అప్పగిస్తామన్నారు. బెట్టింగ్ యాప్‌ల్లో విద్యార్థులు, యువకులు ఎక్కువగా నష్టపోతున్నారని తల్లిదండ్రులు వారి ఫోన్లు పరిశీలిస్తుండాలని సూచించారు. ఒడిశా రాష్ట్రం నుంచి విశాఖ మీదుగా వచ్చే గంజాయిని తరలించే ముఠాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఒడిశా, విశాఖ పోలీస్ యంత్రాంగంతో కోఆర్డినేట్ చేసుకుని గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. షీ టీమ్, మహాశక్తి టీమ్, మహిళా పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ కల్పిస్తున్నామన్నారు. రోడ్ల ప్రమాదాలు జరగకుండా ప్రయివేట్ వ్యక్తుల భాగస్వామ్యంతో నిర్దేశిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుపై దృష్టి సారించామన్నారు. ఆయన వెంట ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఏఎస్పీ ఎన్‌టీకే మురళీ కృష్ణ, సీఐ దుర్గా ప్రసాద్, ఎస్ఐలు జి.వాసు, నాగలక్ష్మీ తదితరులున్నారు. ముందుగా మొగల్తూరు స్టేషన్‌కు చేరుకున్న ఆయన ప్రత్యేక పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కాళ్ళ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పెద అమీరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు కాళ్ళ ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన కూనపురాజు సత్యసూర్యవెంకట సుబ్బరాజు (60) ద్విచక్రవాహనంపై భీమవరం పట్టణంలోని కూతురు ఇంటికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా పెదఅమిరం పరిధిలో ఉన్న ఉండి-భీమవరం రోడ్డులో ఉన్న అశోక్ లేలాండ్ షోరం సర్వీస్ సెంటర్ వద్దకు వచ్చేసరికి రహదారి పక్కన ఆగిఉన్న కారు డోర్ షడన్‌గా తీయడంతో ద్విచక్ర వాహనానికి తగిలింది. దీనితో సుబ్బరాజు రోడ్డుపై పడ్డాడు. వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు అతని తలపై నుంచి వెళ్ళడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని అల్లుడు ఇందుకూరి గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.నాలుగు లక్షలు అపహరణ

చింతలపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మండలం రేచర్ల గ్రామానికి చెందిన చెక్కా శ్రీనివాసరావు అనే వ్యాపారి రూ.నాలుగు లక్షల అపహరణకు గురైంది. స్థానిక యూనియన్ బ్యాంకు నుంచి విత్ డ్రా చేసి బయటకు వచ్చి తన మోటారు సైకిల్‌పై ఉంచగా గుర్తు తెలియని దుండగులు అపహరించారని తెలిపాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కుటుంబరావు సందర్శించి విచారణ చేపట్టారు.

మహిళ మెడలోని
బంగారు గొలుసు చోరీ

ఏలూరు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గొలుసు దొంగలు రెచ్చిపోతున్నారు. ఇప్పటి వరకూ ఒంటిరి మహిళలనే టార్గెట్ చేసిన ఆగంతకులు ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులపైనా తెగబడుతున్నారు. ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డు మార్గ మధ్యలో వేగవరం గ్రామ శివారులో సోమవారం జరిగింది. ఏలూరు వెన్నవల్లివారి పేటకు చెందిన దళిత నాయకులు నేతల రమేష్ బాబు ఆయన సతీమణి నిర్మలతో కలిసి ద్విచక్ర వాహనంపై సోమవారం రాత్రి దెందులూరు మండలం మసీదుపాడు నుంచి ఏలూరు వస్తుండగా గోపన్నపాలెం దాటిన తరువాత వేగవరం గ్రామశివారు కొంతదూరం వెళ్లగానే వెనుక నుంచి ఓ ద్విచక్ర వాహనంపై వచ్చిన ఆగంతకుడు ఒక్కసారిగా నిర్మల మెడలో ఉన్న 5 కాసుల బంగారు గొలుసు తెంపుకుపోయాడు. ఆమెను తోసివేశాడు. దీంతో అదుపుతప్పి రోడ్డు మీద పడి తీవ్ర గాయాలపాలైంది. గాయపడిన బాధితురాలిని ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న దెందులూరు ఎస్ఐ శివాజీ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఆగంతకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఇంటి వెనుక తలుపు తీసి..

జంగారెడ్డిగూడెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటి వెనుక తలుపు తీసి ఇంట్లో ఉన్న రూ.రెండు లక్షల 90 వేల నగదు, తొమ్మిది కాసుల బంగారు వస్తువులు దొంగిలించుకుపోయిన ఘటన సోమవారం జరిగింది. బాధితుడు కర్పూరం ఉమామహేశ్వరరావు తెలితెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉమామహేశ్వరరావు కుమారుడు రవికుమార్ పట్టణంలో బుక్ స్టాల్ నిర్వహిస్తున్నారు. సోమవారం రవికుమార్ తిరుపతి వెళ్లారు. ఉమామహేశ్వరరావు ఇంటికి తాళం వేసి బుక్‌స్టాల్‌కు వెళ్లారు. ఉమామహేశ్వరరావు మధ్యాహ్నం భోజనానికి వచ్చే సరికి కుమారుడు రవికుమార్ తిరుపతి నుంచి వచ్చి పక్క పోర్షన్‌లో పడుకున్నారు. ఇంటి తాళం తీసిన ఉమామహేశ్వరరావుకు వెనుక డోరు తీసి ఉండడం చూసి వెంటనే అల్మరలో ఉన్న బాక్సును తెరిచి చూడగా అందులో పెట్టిన రూ.40 వేల నగదు, తొమ్మిది కాసుల బంగారు వస్తువులు కనిపించలేదు. అదే బాక్సులో ఉన్న బీరువా తాళంతో బీరువాను తీసి చూడగా అందులో పెట్టిన రూ.రెండున్నర లక్షల నగదు కనిపించకపోవడంతో తన ఇంట్లో దొంగలు పడ్డారని గుర్తించారు. వెంటనే జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

కోళ్ల ఫారం దగ్ధం

మొగల్తూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తోటకి చెందిన కవురు గోపన్నకు చెందిన నాటు కోళ్ల ఫారం ఆదివారం రాత్రి దగ్ధమైంది. కోళ్ల పారం దగ్ధమవుతుందని గ్రామస్థులు తనకు సమాచారం అందించడంతో వెళ్లి చూసే సరికి ఫారం పూర్తిగా దగ్ధమైందని బాధితుడు గోపన్న వాపోయాడు. సుమారు 80 కోడి పిల్లలతో పాటు పందెం కోళ్లను పెంచుతున్నానని, సుమారు రూ.4 లక్షలు నష్టం వాటిల్లిందనాడు. మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గోపన్న తెలిపాడు.

తువ్వ మట్టి దోచేస్తున్నారు..


వివరాలు తెలుపుతున్న గోపి, కూటమి నాయకులు

యలమంచిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంతేరు గ్రామంలో ఉన్న పాలకొల్లు పట్టణానికి చెందిన జగనన్న లేఅవుట్‌లో గతంలో వేసిన తువ్వ మట్టిని అదే గ్రామానికి చెందిన ఒక వైసీపీ నాయకుడు ట్రాక్టర్లలో తరలిం చేశాడని స్థానికులు హౌసింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం హౌసింగ్ డీఈ ఆర్.త్రిమూర్తులు, ఏఈలు డి.రమేష్, మోహన్, సిబ్బందితో కలిసి కొంతేరు జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. లేఅవుట్‌లో ఉన్న తువ్వ మట్టిని ఆదివారం ఒక వైసీపీ నాయకుడు ట్రాక్టర్లలో (సుమారు 40 ట్రిప్పులు) తరలించేశారని స్థానికులు హౌసింగ్ అధికారులకు చెప్పారు. గతంలో పని చేసిన హౌసింగ్ ఈఈ, ఇతర అధికారులతో చెప్పి సుమారు 13 లారీల బొండు ఇసుకను లేఅవుట్ రిజర్వు సైట్‌లో వేసుకున్నానని.. ఇప్పుడు దానిని బయటకు తరలిస్తున్నానని, ఆ వైసీపీ నాయకుడు హౌసింగ్ అధికారులకు చెప్పారు. ప్రభుత్వ లే అవుట్‌లో ఉన్న మట్టిని తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఈ డి.సురేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డీఈ ఆర్.త్రిమూర్తులు విలేకరులకు తెలిపారు. తువ్వ మట్టిని తరలించుకుపోయిన వైసీపీ నాయకుడిపై చట్టపరమైన చర్యలు తీకోవాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కడలి గోపాలరావు డిమాండ్ చేశారు. కొంతేరులోని జగనన్న లేఅవుట్ వద్ద సోమవారం విలేకరుల సమావేశంలో గోపాలరావు మాట్లాడుతూ మట్టిని తరలించిన వారిపై తక్షణమే చర్యలు చేపట్టాలని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారని తెలిపారు. జనసేన జిల్లా నాయకుడు ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ లేఅవుట్‌లో మట్టిని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కూటమి నాయకులు చెరుకూరి అంజిబాబు, బొప్పన హరికిశోర్, పీతల శ్రీను, గంటా శ్రీను, మంచెం సత్యనారాయణ, వెన్నా సత్తిబాబు, తానంకి కృష్ణ, ఖండవల్లి నరేంద్ర, ఎ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు దాడుల్లో 115 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఆచంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో ఆచంట మండలం పుచ్చల్లంకకు చెందిన యడ్ల శ్రీనివాసరావు అనే బెల్టు షాపు నిర్వాహకుడి వద్ద నుంచి ఏడు మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐలు పి. మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

- కుక్కునూరు : వేలేరులో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టుకున్నారు. మొత్తం 27 మద్యం సీసాలను అక్రమంగా అమ్ముతున్న క్రమంలో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని వేర్వేరు ప్రాంతాల్లో అరెస్టు చేసి వారి నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ కేఎస్‌వీ కళ్యాణ్ చక్రవర్తి సోమవారం తెలిపారు. మాధవరంనకు చెందిన బాలిన భవానీ శంకర్ నుంచి 30 మద్యం సీసాలు, అత్తిలి మండలం కంచుమర్రుకు చెందిన మరో వ్యక్తి నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సైలు పీఎస్‌డీ భోగేశ్వరరావు, బి రాజేంద్ర ప్రసాద్, మురళిమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.
- ఉంగుటూరు : భీమడోలు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో కైకరం, చేబ్రోలు, నారాయణపురం, ఉంగుటూరు, గొల్లగూడెం, అక్కుపల్లి గోకవరం గ్రామాలలో దాడులు నిర్వహించారు. కైకరం, పెదవెల్లమిల్లి గ్రామాలలో ఇరువురిని అరెస్టు చేసి వారి నుంచి 32 బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని భీమడోలు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు.
- భీమడోలు : సూరప్పగూడెం ఎస్సీ కాలనీ శివారులో అక్రమంగా మద్యం అమ్ముతున్న భీమడోలు గ్రామానికి చెందిన ఎనిగళ్ల రాంబాబును అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకరరావు తెలిపారు.
- ఉండి : బెల్ట్ షాపు నిర్వహకుడిను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమాదేవి తెలిపారు. భీమవరం ఈఎస్‌టీఎఫ్ ఉండి మండలం చినపుల్లేరు పంచాయతీ పరిధిలోని తల్లమ్మచెరువులో నిర్వహించిన దాడులలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న గొల్ల ఆశీర్వాదంను అరెస్టు చేసి అతని వద్ద నుంచి తొమ్మిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ దాడులలో ఆకివీడు ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమాదేవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో అఖిల్ శ్రీవర్మ ప్రతిభ



గణపవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా భోగాపురంలో ఈ నెల 9, 11 తేదీల్లో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి గణపవరం బాలుర హైస్కూల్ విద్యార్థి అఖిల్ శ్రీవర్మ గెలుపొందారు. రాష్ట్రస్థాయి వాలిబాల్ పోటీల్లో మెయిన్ టీమ్‌లో ఆడి 4వ స్థానం సాధించారు. విజయం సాధించిన అఖిల్‌శ్రీ వర్మను శిక్షణ ఇచ్చిన పీడీ ఎం.పద్మావతి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కరాటేలో మాంటిస్సోరి విద్యార్థులకు పతకాలు

పాలకొల్లు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మంగళగిరిలో జరిగిన కరాటే పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులకు పతకాలు సాధించారని ఉల్లంపర్రు మాంటిస్సోరి అడ్మినిస్ట్రేటర్ ఎంఎస్ వాసు తెలిపారు. జూనియర్స్ విభాగంలో కుమిటీ విభాగంలో 2 బంగారు, 4 రజత, 5 కాంశ్య పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను, కరాటే మాస్టర్ పి. శ్రీనివాస్ శివకుమార్‌ను సోమవారం అభినందించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

భీమవరం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం, ఏలూరు ఆశ్రం ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు త్యాగరాజ భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు వబిలిశెట్టి వెంకటేశ్వరరావు తెలిపారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు తేవాలని, చత్వారం ఉంటే కళ్ళజోళ్ళు ఉచితంగా ఇస్తారని, అవసరమైన వారికి ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో ఉచిత ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. సంఘ భవనంలో ఈ నెల 12వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 98498 33199, 94930 66666లలో సంప్రదించాలన్నారు.

చాగంటికి పదవిపై హర్షం

భీమవరం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారుగా చాగంటి కోటేశ్వరరావును నియమించడం పట్ల వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆయన అభిమాను హర్షం వ్యక్తం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో తన ప్రవచనా లతో దశాబ్దాలుగా లక్షలాది మందిని ఆకట్టుకున్న చాగంటికి పదవి ఇవ్వడం గొప్ప విశేషమన్నారు. దేవస్థానం అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, సయ్యపు రాజు సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఆర్‌కేఆర్‌లో ఇంజినీరింగ్ ఫిజిక్స్ పరిశోధన కేంద్రం

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ కళాశాల నిరంతరం పరిశోధనలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతి రాజు అన్నారు. కళాశాలకు జేఎన్టీయుకే నూతనంగా మంజూరు చేసిన ఇంజనీరింగ్ ఫిజిక్స్ పరిశోధన కేంద్రాన్ని సెక్రటరీ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ సోమవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ జేఎన్టీయూకే నిపుణుల బృందం ఇటీవల తమ కళాశాలను సందర్శించి ఇంజనీరింగ్ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌ను లాబరేటరీలను పరిశీలించిందన్నారు. కళాశాల ఫిజిక్స్ హెడ్ డా.ఎంవి సోమేశ్వరరావు మాట్లాడుతూ యువ అధ్యాపకులు కూడా పరిశోధనలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డా.పి భవాని, డా.వెంటకపతిరాజు, ప్రొఫెసర్లు, అధ్యాపక బృందం పాల్గొంది.



అమ్మవార్లను దర్శించుకున్న కేంద్ర మంత్రి వర్మ

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భీమవరం మండలం గొల్లవాని తిప్పలోని పర్లమ్మ, ముత్యాలమ్మ, గౌరమ్మ ఆలయాన్ని సోమవారం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ దర్శించుకున్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ ఉన్నారు.

స్కానింగ్ సెంటర్లు తనిఖీ చేయాలి

నరసాపురం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్ష చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో దాసిరాజు హెచ్చరించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ డివిజన్ స్కానింగ్ సెంటర్ల నిర్వహణపై అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్షించారు. ప్రతి ఐదేళ్ళకు ఒక్కసారి స్కానింగ్ సెంటర్ తప్పనిసరిగా లైసెన్స్‌లను రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. డిప్యూడీ డీఎంహెచ్‌వో స్వరూప్, డీఎస్పీ మురళీకృష్ణ, చల్లా దానయ్యనాయుడు, పులపర్తి ప్రతాప్, డాక్టర్ శిరిష, డాక్టర్ గణేష్, అల్లూరి నళినిదేవిలు పాల్గొన్నారు.



భీమవరంలో ఆజాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అందరికీ స్ఫూర్తి ఆజాద్

» జయంతి వేడుకల్లో వక్తలు » ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

భీమవరం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అబుల్ కలాం ఆజాద్ చిరస్మరణీయుడని ముస్లిం కమిటీ ఛైర్మన్ షేక్ రబ్బానీ అన్నారు. ఆజాద్ జయంతిని పురస్కరించుకుని శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వీరమ్మ పార్కు వద్ద ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎండీ జిలానీ, ఎండీ ఖలీల్, షేక్ భాజీ, ఎస్‌కే చాన్ బాషా కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తదితరులు ప్రసంగించారు.

భీమవరం రూరల్: కలాం స్వాతంత్ర్య సమర యోధుడే కాక కవి కూడా అని అనేక భాషలలో ప్రావీణ్యం సాధించాడని డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు జీవీ నరసింహరాజు అన్నారు. సోమవారం కళాశాలలో జాతీయ విద్యాదినోత్సవం నిర్వహించారు. నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు కలాంకు ఘనంగా నివాళులర్పించారు. డీఎ న్నార్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆజాద్ విద్యా సంస్కరణలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

ఆకివీడు: విద్యార్థులు ఉత్తమ విద్యతో సమాజంలో చక్కని భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని ఎంఈవో సీతారామయ్య, పాస్ట్ డిస్ట్రిక్ట్ గ వర్నర్లు డాక్టర్ ఎంవీఎస్ రాజు, చిలుకూరి కృష్ణంరాజు అన్నారు. కలాం జయంతి సందర్భంగా మండల స్థాయి క్విజ్ పోటీలు సోమవారం స్థానిక లయన్స్ కార్యాలయంలో 16 పాఠశాలలకు చెందిన పదవతరగతి విద్యార్థులకు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

గణపవరం: భారత విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆజాద్ స్ఫూర్తితో ముందుకు సాగాలని ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మధురాజు అన్నారు. సోమవారం గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కలాం జయంతిని పురస్కరించుకుని నేషనల్ ఎడ్యుకేషన్ డే నిర్వహించారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని మహిళా విద్యను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతలు అందజేశారు.

పాలకొల్లు అర్బన్: మన మతం ఏదైనా అందరూ భారతీయులమేనని, స్థానిక రసూల్ సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్ అన్నారు. స్థానిక వీవర్స్ కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో కలాం చిత్ర టానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసారు. స్థానిక ఎఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజ రాజేశ్వరి అధ్యక్షతన జాతీయ విద్యాదినోత్సవం నిర్వహించారు.

ఇరగవరం: దేశ విద్యా వ్యవస్థను రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన ఆజాద్ దూరదృష్టి కలిగిన నాయకుడని హెచ్‌ఎం పి.గోపాలకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక వెంకటరాయపురం పాఠశాలలో కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ కలామ్‌కు నివాళుల ర్పించారు.



అసెంబ్లీ సమావేశాల్లో ఉండి ఎమ్మెల్యే రఘురామరాజు

ఉండి నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలకు వెళ్లిన ఉండి ఎమ్మెల్యే రఘురామ స్పీకర్ అయ్యన్నపాత్రుడును మర్యాదపూర్వకంగా కలుసుకుని మాట్లాడారు. పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, హిందుపురం ఎమ్మెల్యే సినీహీరో నందమూరు బాలకృష్ణలను కలిసికుని మాట్లాడడం కనిపించారు.



కన్నబాబును కలసిన కృష్ణమోహన్

భీమవరం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పుర పరిపాలనా, పట్టణాభివృద్ధి శాఖ ప్రభుత్వ కార్యదర్శిగా కె. కన్నబాబు సోమవారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మునిసిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. కృష్ణమోహన్ ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఉద్యోగుల తరపున అభినందనలు తెలిపారు.



సిబ్బందికి దుప్పట్ల పంపిణీ

భీమవరం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సూర్యమిత్ర ఎగ్జిమ్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు సోమవారం సంస్థ అధినేత ఇర్రింకి సూర్యారావు తన పుట్టినరోజు సందర్భంగా బోనస్ తోపాటు దాదాపు 3 వేల మందికి దుప్పట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ రొయ్యలు వినియోగం స్థానికంగాను, దేశంలోను పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే ఈ రంగానికి మంచి డిమాండ్ ఉంటుందన్నారు. తమ సంస్థ త్వరలో రెడీ టూ ఈట్ పేరిట ఉత్పత్తును తయారుచేసి మార్కెట్‌లకు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

15 వేలు దాటిన సభ్యత్వాలు

ఆచంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆచంట నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎమ్మెల్యే పితాని ఆధ్వర్యంలో జోరుగా సాగుతున్నాయి. నియోజకవర్గంలో పెనుమంట్ర, ఆచంట, పోడూరు, పెనుగొండ మండలాలకు సంబంధించి ఇప్పటి వరకు 15 వేల 385 సభ్యత్వాలు పూర్తి అయ్యాయి.

మానవత ఆర్థిక సాయం

ఇరగవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రంగస్థల నటులు సరిదే లక్ష్మి, నడింపల్లి సత్యవతి వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.5 వేల చెక్కును సోమవారం మానవత సంస్థ అధ్యక్షులు కఠారి శారదాదేవి అధ్యక్షతన అందజేశారు. జిల్లా శాంతి ర్యాలీ ఛైర్మన్ గమిని రాంబాబు, ఉపాధ్యక్షుడు కె.రాజ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఐఏఎస్‌ల బృందం పర్యటన

కాళ్ళ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రాతాళ్ళ మెరకలో మంగళవారం ట్రైనీ ఐఏఎస్‌ల బృందం పర్యటించనున్నట్లు ఎంపీడీవో స్వాతి సోమవారం తెలిపారు. బృందం ఫీల్డ్ స్టడీ అండ్ రీసెర్చ్ ప్రోగ్రామ్ ఫర్ 99వ ఫౌండేషన్ కోర్సులో భాగంగా ప్రాతాళ్ళ మెరక విచ్చేస్తున్నట్లు తెలిపారు. అధికారులంతా రావాలని సూచించారు.

కొత్తపల్లి సుబ్బారాయుడుకు ఘన స్వాగతం



సుబ్బారాయుడును గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా తొలిసారి నియోజకవర్గానికి విచ్చేసిన మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడుకు సోమవారం ఘన స్వాగతం లభించింది. కూటమి నాయకులతో పాటు అభిమానులు ఆయన్ను పూలమాలలతో ముంచెత్తారు. అక్కడ నుంచి రుస్తుంబాదాలోని ఆయన నివాసం వరకు ర్యాలీ సాగింది. అంబేద్కర్ సెంటర్‌లో భారీ గజమాల వేశారు. మాజీ ఎమ్మెల్యే బండారు, టీడీపీ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఆశయాలకనుగుణంగా పని చేస్తా..

కూటమి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ, అర్హులైన కాపులకు, ఇతర సమాజిక వర్గాలకు ప్రభుత్వ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని సుబ్బారాయుడు స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు కీలకమైన పదవినిచ్చారన్నారు. తనతో పాటు పట్టణానికి చెందిన షరీఫ్‌కు కూడా కీలకమైన పదవి ఇవ్వడం ఎంతో ఆనందగా ఉందన్నారు.



నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

భీమవరం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని, పెండింగ్ లో ఉన్న 42 వేల క్లైయిమ్స్ వెంటనే చెల్లించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు సెస్ రూపంలో జమవుతున్న సొమ్మును జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఇసుక తవ్వకం ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వరాదని, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ అధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ధర్నా, ఆందోళన కార్యక్రమాలను నిర్వహించి కలెక్టర్ నాగరాణికి వినతి పత్రాన్ని సమర్పించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, ఏఐటీ యూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వీఓఏల ధర్నా

నరసాపురం టౌన్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఓఏలు ధర్నా నిర్వహించారు. వీరికి సీఐటీయూ సంఘీభావం తెలిపింది. వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, నాలుగు నెలల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ ప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు.

పేదలతో అధికారుల ఆటలు : సీపీఎం

ఆకివీడు: పేదల జీవితాలతో అధికారులు ఆడుకుంటున్నారని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నాచేసి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులకు అర్జీ అందజేసి మాట్లాడుతూ స్థానిక అయి-భీమవరం రోడ్‌లో సుమారు 60 ఏళ్లుగా నివశిస్తున్న వారికి నోటీసులు అందచేసి కరంటు కట్ చేశారన్నారు. ఐదు రోజులుగా సబ్ స్టేషన్‌లోనే బాధితులు పడుకుంటున్నా అధికారుల్లో చలనం రావడంలేదన్నారు. ఇటీవల ముంపుబారిన పడిన బాధితులకు తక్షణమే సహాయం మంజూరు చేయాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాచేసి తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు.

మహనీయుడు మూర్తిరాజు



ఇరగవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తన జీవితాన్ని విద్యావ్యాప్తికి అంకితం చేసిన మహనీయుడు మూర్తిరాజు అని ముఖ్యఅతిథి దాట్ల సత్యనారాయణ రాజు కొనియాడారు. టంగుటూరి ప్రకాశం పంతులు జడ్పీ ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులు చింతలపాటి సీతావరప్రసాద్ మూర్తి రాజు వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ అధ్యక్షతన ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా గణిత ఉపాధ్యాయిని ఎస్‌కే రజియా ఆర్థిక సాయంతో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఐఎంఎస్‌కే రాజు, ఉపాధ్యాయులు పి.శ్రీదేవి, డి.మంగతాయారు, సీఎస్ విజయలక్ష్మి, కె.అరుణ, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దర్భరేవు డ్రెయిన్‌పై రెగ్యులేటర్ నిర్మించాలి

మొగల్తూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దర్భరేవు డ్రెయిన్‌పై రెగ్యులేటర్ నిర్మించి రైతులను ఆదుకోవాలని సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో రామన్నపాలెం సర్పంచ్, ఉప సర్పంచ్, రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. దర్భరేవు డ్రెయిన్ ఆటుపోటుల ప్రభావంతో సుమారు 7 వేల ఎకరాలు నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పలు గ్రామాల్లో వరి సాగు చేయలేకపోతున్నామని, ఆక్వా సాగు డ్రెయిన్ ఆటుపోటుల ప్రభావంతో నష్టపోతున్నామన్నారు. కొత్తకాయలతిప్ప వద్ద డ్రెయిన్‌పై రెగ్యులేటర్ నిర్మించాలన్నారు. సర్పంచ్ ఎలీషా, ఉప సర్పంచ్ ఆజా, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాజా, రైతులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఇబ్బందులు రానివ్వం : ఎంఈవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాలకోడేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చదువు సాగేదెలా శీర్షికన అధ్యాపకుల కొరతపై ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన అధికారులు స్పందించారు. డీఈఓ ఆదేశాలతో పాలకోడేరు ఎంఈఓ శివన్నారాయణ సోమవారం పాలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఈ విద్యా విధానంలో అధ్యాపకుల కొరత వాస్తవమేనని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బోధన అందిస్తున్నామన్నారు. ఆయన వెంట పాలకోడేరు హెచ్‌ఎం మహేష్‌బాబు ఉన్నారు.



వసతి గృహాల సందర్శన

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బలుసుమూడిలోని శ్రీ వేంకటేశ్వర బధిరుల పాఠశాల, జువ్వలపాలెం రోడ్డులోని సెంటర్ ఫర్ విజువల్లీ ఛాలెంజ్డ్ హోమ్‌ను, పెదఅమిరంలోని అరుణోదయ మానసిక వికాస కేంద్రాన్ని సోమవారం భీమవరం 3వ అదనపు జిల్లా న్యాయాధికారి, మండల న్యాయసేవా సంస్థ ఛైర్మన్ ఎంఏ సోమశేఖర్ సందర్శించారు. డాక్టర్ తరచూ వస్తున్నారా, మందులు ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగారు. కేంద్రాల నిర్వాహకులు హాస్టళ్లలో ఉన్న సమస్యలను న్యాయమూర్తి దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్యానల్ న్యాయవాదులు ఎన్. సుధీర్, బి. సురేష్‌కుమార్, కె. జ్యోతి, డి. రవికిరణ్, కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.



సీసీ రోడ్లును స్థానిక నాయకులతో కలసి పరిశీలిస్తున్న పితాని తనయుడు వెంకట్

రహదారుల నిర్మాణం పరిశీలన

పెనుగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోత): గత ప్రభుత్వంలో రోడ్లన్ని అస్తవ్యస్తంగా మారి ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని ఎమ్మెల్యే తనయుడు పితాని వెంకట్ అన్నారు. పెనుగొండలోని చెరుకువాడలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణాలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మల్లుల లక్ష్మీనారాయణ, సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, టౌన్ ప్రెసిడెంట్ కటికిరెడ్డి నానాజీ, కార్యదర్శి వేంద్ర రాము, జనసేన మండల అధ్యక్షుడు కొండవీటి శ్రీనివాసు, పట్టణ అధ్యక్షుడు గుర్రాల సూరిబాబు, పంచాయతీ మెంబర్లు పాల్గొన్నారు.

ఆదర్శ దాత రాధారమణ గుప్తా

పాలకొల్లు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లులో ఆదర్శ దాతగా బొండాడ రాధారమణ గుప్త నిలుస్తారని ప్రెస్ క్లబ్ సభ్యులు అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్ శాశ్వత గౌరవాధ్యక్షుడు రాధా రమణ గుప్త సంతాప సభ సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఉపాధ్యక్షుడు గోపరాజు గోపి అధ్యక్షతన జరిగింది. ముందుగా గుప్తా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు పీటీ వెంకటేశ్వరరావు, ప్రెస్ క్లబ్ కోశాధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో పన్నుల భారం లేదు

బండారు మాధవనాయుడు, మాజీ ఎమ్మెల్యే



రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడ్జెట్ భేషుగ్గా ఉంది. ప్రజలపై పన్నుల భారం వేయకుండా కేటాయింపుల్లో అన్ని రంగాలకు సముచిత స్థానం కల్పించారు. గత ప్రభుత్వ హయాంలో బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఉండేది కానీ పనులు జరిగేవికావు. దీంతో రాష్ట్ర అభివృద్ధి 20 ఏళ్ల వెనక్కి వెళ్లింది. ఈ కేటాయింపులతో అన్ని రంగాలు ఒక గాడిలో పడతాయి.

అన్ని వర్గాలకు ఆమోదయోగ్యం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి



బడ్జెట్ అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉంది. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేలా బడ్జెట్ కేటాయింపు ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఆయా శాఖల మంత్రులకు కృతజ్ఞతలు.

అన్న సమారాధన

పెంటపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని పెంటపాడు కాశీఅన్నపూర్ణేశ్వరి ఆలయం వద్ద శెట్టిబలిజ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అమ్మవారికి పూజలు చేశారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, ఎరుబండి సతీష్ పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో హత్యకు గురైన మహిళ తల్లిదండ్రులు ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. గ్రామస్థులంతా స్వచ్ఛందంగా పాల్గొని న్యాయం చేయాలని నినాదాలు చేశారు. మృతురాలు నాగశ్రావణి పిల్లలకు రక్షణ కల్పించాలని శ్రావణి తండ్రి మేడూరి శ్రీనివాస్, తల్లి సత్యకుమారి వేడుకున్నారు.

కొమ్ముగూడెం సర్పంచ్‌కు పితృ వియోగం

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కొమ్ముగూడెం సర్పంచ్ తాడేపల్లి బేబి తండ్రి పందిరి వీరాస్వామి (84) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన టీడీపీ మండల నాయకులు తాడేపల్లి శ్రీనివాస్‌కు స్వయానా మేనమామ. వీరాస్వామి మృతికి కొమ్ముగూడెం కూటమి నాయకులు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాలు

అత్తిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అత్తిలి విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. సంఘ అధ్యక్షుడు పట్నాల బాబు, కార్యదర్శి అనుపోజు అప్పలస్వామి ఆధ్వర్యంలో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. అనుపోజు వీరాచార్యులు చిన సత్యవతి దంపతులు మహా గణపతి పూజ, ప్రధాన కలశారాధన, అష్టోత్తర శతనామావళి కలశ స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ నాయకులు బల్లంకి ఆచారి, పట్నాల కృష్ణ, నాగరాజు, ముదపాక బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు. క్రొవ్విడి వెంకన్నబాబు అర్చకత్వంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

అత్తిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అత్తిలి గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి డి.కృష్ణారావు తెలిపారు. 14న జ్యోతి ప్రజ్వలనతో వారోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 15న పుస్తక ప్రదర్శన, వ్యాసరచన, 16న చిత్రలేఖనం, 17న వక్తృత్వ పోటీలు, 18న పాటల పోటీలు, 19న ముగ్గుల పోటీలు, 20న ముగింపు కార్యక్రమం, బహుమతి ప్రదానం జరుగుతుందని తెలిపారు.

నరసాపురం టౌన్: శాఖ గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ కుమారి తెలిపారు. 14న చిత్రలేఖనం, 15న డ్రగ్స్‌పై అవగాహన, 16న వ్యాసరచన, 17న కవిత్వ, 18న చెస్ 19న క్విజ్ పోటీలు, 20న ముగింపు సభ ఉంటుందన్నారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొవాలని కోరారు.

యానిమేటర్ల సమస్యలు పరిష్కరించండి

పెనుమంట్ర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల శాఖ డిమాండ్ చేసింది. సోమవారం పెనుమంట్ర మండల కమిటీ ఆధ్వర్యంలో డ్వాక్రా యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీఎం పద్మకు వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని వేతనాలు బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.



పెనుమంట్ర రామేశ్వరస్వామికి పూజలు

హర హర మహాదేవ

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు.. కార్తీక సోమవారం సందర్భంగా శివయ్యకు అభిషేకాలు

నరసాపురం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తీరంలో సోమవారం కార్తీక శోభ నెలకొంది. కార్తీకమాసం రెండో సోమవారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం కార్తీక దీపాలను గోదావరిలో విడిచిపెట్టారు. పట్టణంలోని అమరేశ్వర, ఏకాంబరేశ్వరస్వామి, మండలంలోని లక్ష్మణేశ్వరస్వామి వార్లకు భక్తులు పెద్ద సంఖ్యలో అభిషేకాలు చేయించుకున్నారు. ఉదయం నుంచి ఉపవాసాలు చేసి కార్తీక నోములు నోచుకున్నారు.

భీమవరం టౌన్: కార్తీక సోమవారం పురస్కరించుకుని శ్రీనివాస థియేటర్ సెంటర్‌లోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వామికి కృష్ణబలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టీడీపీ బీసీ సాధికార కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు దంపతుల ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం 108 కేజీల అన్నంతో అన్నాభిషేకం నిర్వహించారు. స్వామివారికి అభిషేకం చేసిన అన్న ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు.

గణపవరం: కార్తీకమాసం 2వ సోమవారం సందర్భంగా గణపవరంలోని శ్రీసువర్ణేశ్వరస్వామి ఆలయంలో పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించారు. ప్రధాన అర్చకులు చెరుకూరి వరప్రసాద రావు పూజలు నిర్వహించారు. ఈవో శోభనాద్రి, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణంరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉండి: శ్రీపార్వతీ చెన్నమల్లేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, సాయంత్రం జ్యోతిర్లింగార్చన జరిగింది.

పెనుమంట్ర: నత్తా రామేశ్వరంలోని త్రిలింగ క్షేత్రాన్ని భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే మహిళలు స్థానిక కోనేరులో కార్తీకదీపాలు వదిలారు. జుత్తిగలోని శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. పాలమూరు మార్కండేశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహించారు.

పెంటపాడు: పెంటపాడు పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ నెల 15న ఆలయం వద్ద లక్షపత్రి పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి తెలిపారు.

ఆచంట: ప్రసిద్ధ ఆచంటేశ్వరుని ఆలయం భక్తులతో పోటెత్తింది. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా ఆలయ అధికారి ఆదిమూలం సత్యనారాయణ, సిబ్బంది వారికి ఏర్పాట్లు చేపట్టారు.



ఆచంటేశ్వరునికి పాలాభిషేకం

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని భువనేశ్వరీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయం, పేరుపాలెం, కెపిపాలెంలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయాలు, కాళీపట్నం కాళికేశ్వరస్వామి, మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి, వడయార్పేటలోని స్వయంభూలింగేశ్వర వనమల్లికార్జున స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.